క్లుప్తంగా

ఐటీఐ సీట్లకు దరఖాస్తు చేసుకోండి

వేంపల్లె : పట్టణంలోని కందుల ఓబుళరెడ్డి ఐటీఐ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ ట్రేడ్‌లలో చేరడానికి ఆసక్తిగల విద్యార్థులు వచ్చేనెల 6వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, సివిల్, డీజిల్ మెకానిక్ వెల్డర్ ట్రేడ్‌లలో సీట్లు కలవని.. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు ఐటీఐ కళాశాలలో సంప్రదించాలన్నారు.

నేటి నుంచి ఇంటర్ అడ్మిషన్లు

లింగాల : లింగాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నుంచి ఇంటర్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ రాజశేఖరరెడ్డి తెలిపారు. ఇంటర్ ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ గ్రూపులకు టెన్త్ పాసైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన తెలిపారు. అదేవిధంగా తెలుగు, ఇంగ్లీషు మీడియం సదుపాయాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

వీరపునాయునిపల్లె : మండలంలోని యు. రాజుపాలెం సచివాలయ పరిధిలోని తాటిమాకులపల్లె, కదిరేపల్లె, రాజుపాలెం గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, సీకేదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులురెడ్డిలు పాల్గొంటారని మండల కన్వీనర్ రఘునాథరెడ్డి తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కాంగ్రెస్ పార్టీ నాయకుల సంబరాలు

పులివెందుల రూరల్ : కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం పట్టణంలోని స్థానిక కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తిరుపాల్‌రెడ్డి, మహీంద్ర, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలుగా గుంటూరు జిల్లా ఎద్దులు

జమ్మలమడుగు : శ్రీ నారాపురస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా నిర్వహించిన సీనియర్ ఒంగోలు జాతి ఎద్దుల పోటీలలో గుంటూరు జిల్లాకు చెందిన ఎద్దులు మొదటి స్థానంలో నిలిచాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి చేతుల మీదుగా విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. రెండో స్థానంలో కృష్ణ జిల్లా కానుకు చెందిన డీవీఆర్ ఎద్దులు, మూడో స్థానంలో ప్రొద్దుటూరు మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన మార్తల చంద్ర ఓబుల్‌రెడ్డి ఎద్దులు నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు.

దివ్యాంగులకు గృహోపకరణాలు పంపిణీ

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక ముద్దనూరు రోడ్డులోని వికలాంగుల కార్యాలయంలో ఆదివారం మదర్స్ డే సందర్భంగా పులివెందుల వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్, విద్యాధరి పాఠశాల సంయుక్త ఆధ్వర్యంలో పదవ తరగతి ఫలితాలలో ఉత్తీర్ణులైన దివ్యాంగ విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. ఈ సభకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ తల్లం ప్రభాకర్, విద్యాధరి పాఠశాల సీఈఓ భానుప్రకాష్‌లు హాజరై దివ్యాంగులకు గృహోపకరణాలను అందించారు. కార్యక్రమంలో వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి, వాసవీక్లబ్ అధ్యక్ష, కోశాధికారులు నాగభూషణం, చంద్రమౌళి, వాసవీ క్లబ్ సభ్యులు, హెడ్మాస్టర్ అంకన్న, వికలాంగుల సంఘ కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : కొత్తపేట–బుగ్గలేటిపల్లి సరిహద్దుల్లోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పట్టు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. కోర్కెలు తీరిన భక్తులు ముద్దలను ఏర్పాటు చేసి ఆభరణాలను, పట్టు వస్త్రాలను కానుకలుగా సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పార్వతమ్మగారి విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ ఆవరణంలో బంధుమిత్రులతో విందుభోజనాలను చేశారు. ఆలయ సమీపంలోని ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అంజనీ పుత్రుడికి భక్తుల నీరాజనం

అంజన్న ఆలయాల్లో ఘనంగా హనుమజ్జయంతి వేడుకలు



పులివెందులలో ట్రాక్టర్ పల్లకిలో ఉన్న ఆంజనేయస్వామి ఉత్సవమూర్తి



పులివెందులలో సాగుతున్న హనుమాన్ శోభాయాత్ర



గండికోట రహదారిలోని 35 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం

పులివెందుల టౌన్ : హనుమజ్జయంతిని పురస్కరించుకుని పులివెందుల పట్టణంలోని అంజన్న ఆలయాలు ఆదివారం భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని తూర్పు ఆంజనేయస్వామి, పడమటి ఆంజనేయస్వామి, కోతి సమాధి ఆంజనేయస్వామి, పీడబ్ల్యూ ఆంజనేయస్వామి ఆలయాలలో హనుమజ్జయంతి సందర్భంగా ఆంజనేయస్వామిని అర్చకులు ప్రత్యేక అలంకరించి ఆకుపూజలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆంజనేయస్వామిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆయా ఆలయాలలో భక్తుల తాళాల భజన ఆకట్టుకున్నాయి. హనుజ్జయంతిని పురస్కరించుకుని పడమటి ఆంజనేయస్వామి ఆలయానికి మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డిలతో కలిసి వెళ్లి ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి వైఎస్ మనోహర్‌రెడ్డితోపాటు పలువురికి శాలువాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందించారు.



పులివెందులలో ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి

అనంతరం భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లు ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర

హనుమజ్జయంతి సందర్భంగా పులివెందుల పట్టణంలో హనుమాన్ శోభ యాత్ర వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం హిందు భక్తులు బైకు ర్యాలీ నిర్వహించారు. స్థానిక కోతి సమాధి ఆలయం వద్ద నుంచి మెయిన్‌బజార్, పూలంగళ్ల సర్కిల్ మీదుగా కొత్త ఆర్టీసీ బస్టాండు వరకు బైకు ర్యాలీ నిర్వహించారు. బైకులకు హనుమాన్ కాషాయ జెండాలను కట్టుకుని జై శ్రీరామ్, జై హనుమాన్ అంటూ నినాదాలు చేసుకుంటూ హిందు భక్తులు శోభాయమానంగా ర్యాలీ నిర్వహించారు. అలాగే సాయంత్రం హిందు భక్తులందరూ కలిసి స్థానిక కొత్త బస్టాండు సమీపంలోని పీడబ్ల్యూ ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుండి ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ట్రాక్టర్‌లో ఉంచి శోభ యాత్ర నిర్వహించారు. ఈ శోభ యాత్రలో భక్తులు కాషాయం తిలకం దిద్ది కాషాయ జెండాను చేతపట్టుకుని డప్పు వాయిద్యాల మధ్య జై శ్రీరామ్, జై జై శ్రీరామ్, జై హనుమాన్ అంటూ నినాదాలు చేస్తూ చిందులేస్తూ ముందుకు సాగారు. ఈ యాత్ర కొత్త బస్టాండు నుండి కచేరి రోడ్డు, మెయిన్ బజార్, పూలంగళ్ల సర్కిల్, ఆర్టీసీ సర్కిల్ మీదుగా అంబకపల్లె రోడ్డులోని రామాలయం వరకు సాగింది. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో హిందు భక్తులు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : నల్లపురెడ్డిపల్లె గ్రామంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కనంపల్లె, కొత్తపల్లె, ఎర్రబల్లె, అచ్చివెళ్లి, ఎర్రిపల్లె, తుమ్మలపల్లె, రాగిమానుపల్లె గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయలలో చెక్కభజన కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. మండల వ్యాప్తంగా హనుమజ్జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు.

వేంపల్లెలో..

వేంపల్లె : హనుమజ్జయంతిని పురస్కరించుకుని వేంపల్లెలోని శ్రీ వృషభాచలేశ్వరస్వామి దేవస్థానం అనుసంధానంలోని ఆంజనేయస్వామి ఆలయంలో మూడు రోజుల నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయ ఈఓ శ్రీధర్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రధాన అర్చకులు హరిప్రవీణ్ నేతృత్వంలో ఆంజనేయస్వామిని దాతల సహకారంతో డ్రైఫ్రూట్స్‌తో అలంకరణ చేశారు. విద్యుత్ దీపాలతో, పూలమాలలతో సుందరంగా అలంకరించారు. ఉదయాన్నే ఆలయంలో పూర్ణాహుతి, స్వామివారికి ప్రీతికరమైన ఆకుపూజ, వడమాల పూజ తదితర విశేష పూజలు నిర్వహించారు. డ్రైఫ్రూట్స్ భక్తులకు ఆకట్టుకుందని తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అలాగే వేంపల్లె మండల జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆర్.వేణు, ప్రముఖులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వెంకటేష్, ప్రధాన అర్చకులు హరి ప్రవీణ్, పాలక మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

చక్రాయపేటలో..

చక్రాయపేట : హనుమజ్జయంతి పురష్కరించుకుని చక్రాయపేటలో వెలసిన శ్రీవేంకటేశ్వర రాచరాయ స్వామి ఆలయాల ఆధ్వర్యంలో నిర్వహించిన హనుమాన్ శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. గండి అంజన్న సన్నిధిలో మొదలైన యాత్ర అద్దాలమరి క్రాస్, అద్దాలమర్రి, చెరువుకాంపల్లె, కుమారకాల్వ దళితవాడ, కుమారకాల్వ, వెన్నపల్లె, సిద్దారెడ్డిపల్లె, గడ్డంవారిపల్లె, తక్కళ్లపల్లె, నక్కలదిన్నె పల్లె, కె.రాజుపల్లె, కుప్పం, బురుజుపల్లె, నెరుసుపల్లె క్రాస్ ఆంజనేయపురం మీదుగా చక్రాయపేటలోని ఆలయాల వద్దకు చేరింది. ఏపీ ఆగ్రోస్ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నకృష్ణారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్రారెడ్డిలు హిందూ సంస్కృతి సాంప్రదాయాలపై ఇచ్చిన ప్రసంగం ప్రజలను ఆకట్టు కొంది. ఆలయ కమిటీ చైర్మెన్ రామాంజనేయరెడ్డి, మాజీ చైర్మెన్‌లు చక్రపాణిరెడ్డి, ఓబుళరెడ్డి, హరనాథరెడ్డిల ఆధ్వర్యంలోనిర్వహించిన ఈ కార్యక్రమానికి గండి ఆలయ సహాయ కమిషనర్ జెండా ఊపి ప్రారంభించారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : మండలంలోని గురిజాల, కసనూరు, అంకాలమ్మగూడూరు, బలపనూరు, నిడివెల్ల, సింహాద్రిపురం తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణతోపాటు ఆకు పూజ, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. హనుమాన్ జయంతి సందర్భంగా నిడివెల్ల ఆంజనేయస్వామి ఆలయంలో విశేష పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే కసనూరు ఆంజనేయస్వామి ఆలయంలో గత నాలుగు రోజులుగా భాగవత సప్తాహం నిర్వహిస్తున్నారు.



పెద్దముడియం గ్రామోత్సవంలో ఆంజనేయస్వామి

లింగాలలో..

లింగాల : మండలంలోని లింగాల, కర్ణపాపాయపల్లె, వెలిదండ్ల, కొండమోటు, పార్నపల్లె తదితర గ్రామాల్లో ఆంజనేయస్వామికి ఆకుపూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం కర్ణపాపాయపల్లె గ్రామంలో ఆంజనేయ స్వామి గ్రామోత్సవం నిర్వహించారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : మండలంలోని ఆలయాల్లో ఆదివారం హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రజలు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు జరిపించారు. సంగాలపల్లె గ్రామం వద్ద వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త దేవిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వీరపునాయునిపల్లెలో వెంకటసుబ్బానాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆంజనేయ స్వామి గ్రామోత్సవం వైభవంగా జరిగింది.

చెన్నూరులో..

చెన్నూరు : స్థానిక బ్రాహ్మణవీధిలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం హనుమజ్జయంతి వేడుకలను ఆలయ అభివృద్ధి కమిటీ నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలో హనుమజ్జయంతి సందర్భంగా భక్తులు బైక్ ర్యాలీ నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. బుడ్డాయపల్లి వద్ద అభయాంజనేయ స్వామి ఆలయంలో ఆలయ నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి కార్యక్రమాలలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : మండల పరిధిలోని పర్యాటక కేంద్రమైన గండికోట రహదారిలో నూతనంగా నిర్మించిన 35 అడుగుల అభయాంజనేయ విగ్రహం వద్ద హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం గండికోట వాసులు, గ్రామ సర్పంచ్ గురు ఈశ్వర్‌లు హనుమాన్ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. స్వామికి ప్రత్యేక పూజలతో పాటు వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

జమ్మలమడుగు రూరల్ : మండల పరిధిలోని ఆంజనేయస్వామి దేవాలయాలలో హనుమాన్ జయంతి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయాలకు భక్తులు తరలివచ్చి ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

పెద్దముడియంలో..

పెద్దముడియం : మండలంలోని పలు గ్రామాల్లో ఆంజనేయస్వామి జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే భక్తులు గ్రామాల్లోని దేవాలయాలకు చేరుకుని అర్చకుల చేత ప్రత్యేక పూజలు చేయించారు. పెద్దపసుపుల గ్రామంలో స్వామి వారికి గ్రామోత్సవం నిర్వహించి చెక్కభజన ఏర్పాటు చేశారు.అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : హనుమాన్ జయంతి వేడుకలను వాడ వాడలా ఘనంగా నిర్వహించారు. అభిషేకం, అర్చన పూజాది కార్యక్రమలు నిర్వహించారు. పలువురు భక్తులు ఆలయాలను సందర్శించి పూజల్లో పాల్గొన్నారు.

కమలాపురంలో..

కమలాపురం : మండలంలోని వివిధ గ్రామాల్లో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం కమలాపురం పట్టణంలోని మార్కెట్ వీధిలో వెలసిన అభయాంజనేయ స్వామి ఆలయం, బ్రాహ్మణ వీధిలో వెలసిన పిచ్చి ఆంజనేయ స్వామి ఆలయంతో పాటు గంగవరం, కుంట, కోగటం, పందిళ్లపల్లె, ఎర్రగుడిపాడు, పెద్దచెప్పలి తదితర గ్రామాల్లో హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. పలు చోట్ల అన్నదానాలు ఏర్పాటు చేశారు.



చక్రాయపేటలో హనుమాన్ శోభాయాత్ర



వేంపల్లె : డ్రైఫ్రూట్స్ అలంకరణలో ఆంజనేయస్వామి

వల్లూరులో..

వల్లూరు : మండలంలో హనుమజ్జయంతిని పురస్కరించుకుని వల్లూరు, గోటూరు, పెద్దపుత్త, పాపాఘ్ని నగర్, కుమారునిపల్లె గ్రామాలలో భక్తులు తెల్లవారుజామున నుంచే ఆంజనేయస్వామి ఆలయాలకు చేరుకుని పంచామృత అభిషేకాలు నిర్వహించారు. వల్లూరు, గోటూరు తదితర గ్రామాల్లో అన్నదానం ఏర్పాటు చేశారు. పెద్దపుత్తలో గ్రామోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. గోటూరులో బండలాగుడు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



వేంపల్లెలో అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు



తొండూరులో అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

వేంపల్లె : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1979-80వ బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 43 సంవత్సరాల తర్వాత ఆ బ్యాచ్ పూర్వపు విద్యార్థులందరూ ఒక చోటికి చేరి గతంలో జరిగిన తీపి గుర్తులను నెమరువేసుకున్నారు. అనంతరం జెడ్పీబాలుర ఉన్న పాఠశాల నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీగా వెళ్లారు. మధ్యాహ్నం ఎస్ఎస్ఆర్ కళ్యాణ మండపంలో పూర్వపు విద్యార్థులు కుటుంబ సభ్యులతో కలిసి భోజనాలు చేశారు. ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

తొండూరు : మండల కేంద్రమైన తొండూరు జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1986–1987 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు 35 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా విద్యార్థులు హాజరై అప్పటి హెడ్మాస్టర్‌తోపాటు ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో సత్కరించి మెమెంటోలను అందించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

విద్యార్థులకు పుస్తక పఠనం

పులివెందుల టౌన్ : పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపులో భాగంగా ఆదివారం విద్యార్థులకు నీతి కథలు చెప్పడం, పుస్తక పఠనం, చిత్రలేఖనం తరగతులు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ కృష్ణ కిశోర్‌రెడ్డి, ఉపాధ్యాయులు ప్రసాద్‌రెడ్డి, ఓబులేసు, లైబ్రేరియన్ కృష్ణకిశోర్‌రెడ్డి, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులలో భాగంగా ఆదివారం విద్యార్థులకు పోస్ట్ మాస్టర్ వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నీతి కథలు చెప్పడం జరిగింది. అలాగే చదువు ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎస్.సి.శేఖర్, పాఠకులు పాల్గొన్నారు.

కమలాపురంలో..

కమలాపురం : విజ్ఞానం, ఆలోచనలు రేకెత్తించే క్రీడలు, ఆటలు ఆడాలని కమలాపురం శాఖ గ్రంథాలయాధికారి నాగాంజలి తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన సదస్సులో భాగంగా ఆదివారం విజ్ఞానం, ఆలోచనలు రేకెత్తించే క్యారమ్స్ తదితర ఆటల్లో ఆమె విద్యార్థులకు శిక్షణనిచ్చారు. ఆమె మాట్లాడుతూ చదువులోనే కాకుండా వివిధ క్రీడాంశాల్లో సైతం ప్రతిభ చూపాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సింహాద్రిపురంలో విద్యార్థులకు నీతి కథలు చెబుతున్న పోస్ట్ మాస్టర వెంకటేశ్వరరెడ్డి



కమలాపురంలో విద్యార్థులతో ఆటలు ఆడిస్తున్న గ్రంథాలయాధి కారిణి నాగాంజలి

ముగిసిన సుంకులమ్మ తిరునాల

కమలాపురం : పట్టణ పరిధిలోని చెరువు కట్టపై వెలసిన శ్రీ వరాల సుంకులమ్మ తిరునాల ఘనంగా ముగిసింది. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న సుంకులమ్మ అష్టమ బ్రహ్మోత్సవ తిరునాల మహోత్సవం ఆదివారం వైభవంగా ముగిసింది. ఉదయం ప్రాతఃకాల పూజలతో కార్యక్రమాలు ప్రారంభించారు. ప్రముఖ వేద పండితులు సరసా శివకుమార్ శర్మ, నాగశయన శర్మ ఆచారత్వమున అమ్మవారికి అభిషేకాలు, మంగళ హారతి, రుద్ర హోమము, పూర్ణాహుతి, కుష్మాండబలి, కక్షజ్వాల, మహా ప్రసాద నివేదనము, మహా మంగళ హారతి, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. పట్టణం నుంచే కాక సమీప గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు చవ్వారెడ్డి రామసుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవంలో పెద్ద ఎత్తున బాణా సంచా పేల్చుతూ డప్పు వాయిద్యాల నడుమ యువత నృత్యాలు చేశారు. ఊరేగింపులో భజన బృందం చేసిన భజన, కోలాటం భక్తులను విశేషంగా అలరించింది. తిరునాల మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, రాష్ట్ర పరిశ్రమల శాఖ సలహాదారుడు రాజోలి వీరారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పూర్ణ కుంభంతో వారికి స్వాగతం పలికారు. మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ సీఎస్ నారాయణరెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో వారికి శాలువ కప్పి ఘనంగా సన్మానించారు.



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



పోటీలను ప్రారంభిస్తున్న ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి

ఘనంగా బండలాగుడు పోటీలు

పట్టణంలోని చెరువు కట్టపై వెలసిన శ్రీ వరాల సుంకులమ్మ అష్టమ తిరునాల మహోత్సవాన్ని పురస్కరించుకు ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలు పోటా పోటీగా సాగాయి. ఆదివారం నిర్వహించిన సీనియర్ కేటగిరి బండ లాగుడు పోటీలను ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి ప్రారంభించారు. రాష్ట్రం లోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఎడ్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. బాపట్ల జిల్లా చుందూరు మండలం వేటపాలెంకు చెందిన శిరీషా చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్లు అత్యధికంగా 2164 అడుగులు రాతిదూలాన్ని లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. అలాగే రంగారెడ్డి జిల్లా బాలాపూర్‌కు చెందిన ప్రసన్నరెడ్డి కంబైన్డ్ నంద్యాల జిల్లా ప్యాపిలికి చెందిన శ్రీరాములు యాదవ్ ఎడ్లు 1927 అడుగులతో ద్వితీయ స్థానంలో నిలిచాయి. నంద్యాల జిల్లా డోన్‌కు చెందిన గురునాథ్ ఎడ్లు 1759 అడుగులతో తృతీయ స్థానంలో, బాపట్ల జిల్లా బల్లికురువకు చెందిన పావులూరి వీరస్వామి చౌదరి, ప్రకాశం జిల్లా రాచర్లకు చెందిన బాలరాజు ఎడ్లు 1500 అడుగులతో నాల్గవ స్థానంలో, బాపట్ల జిల్లా బల్లికురువకు చెందిన పావులూరి వీరా స్వామి చౌదరి ఎడ్లు 1338 అడుగులతో ఐదవ స్థానంలో, నంద్యాల జిల్లా ప్యాపిలికి చెందిన చిన్న నాగన్న, అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన జయరామిరెడ్డి కంబైన్డ్ ఎడ్లు 1269 అడుగులతో ఆరవ స్థానంలో నిలిచాయి. వారికి వరుసగా రూ.1.50లక్షలు, రూ.1లక్ష, రూ.75వేలు, రూ.50వేలు, రూ.25వేలు, రూ.15వేలు నగదు బహుమతులు అందజేశారు.

ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలి

కడప ఎడ్యుకేషన్: కార్పొరేట్‌లో పాఠశాలల్లో ముందస్తు అడ్మిషన్లను విద్యాశాఖ అధికారులు అరికట్టాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా కడప నగరంతోపాటు రాయచోటి, రాజంపేట, పొద్దుటూరు, బద్వేల్, మదనపల్లె ప్రాంతాల్లో ఉన్న కార్పొరేట్ పాఠశాలల యజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా పెద్దపెద్ద హోర్డింగులను ఏర్పాటు చేసి ప్రచారాలను హోరెత్తిస్తున్నారన్నారు. ఇప్పటికే సగం కార్పొరేట్ పాఠశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేశాయని ఆరోపించారు. విద్యాశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విజయవాడలో మహా యజ్ఞానికి తరలిరండి

కడప కల్చరల్ : రాష్ట్ర ప్రభుత్వం లోక కల్యాణం కోసం నిర్వహిస్తున్న మహా యజ్ఞానికి జిల్లా వాసులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని వైఎస్సార్ జిల్లా దేవదాయ ధర్మదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్ బాలాజీ పిలుపునిచ్చారు. విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో మూడు రోజులుగా జరుగుతున్న అత్యంత అరుదైన శతకుండాత్మక, చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీ లక్ష్మి మహా యజ్ఞం అత్యంత పవిత్రంగా వేద పండితులతో నిర్వహిస్తున్నారని తెలి పారు. జిల్లా నుంచి ఇప్పటికే ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొనే అరుదైన అవకాశాన్ని పలువురు భక్తులు వినియోగించుకున్నారని, జిల్లా వాసుల్లో మిగతా భక్తులు కూడా ఈ అరుదైన అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ హోమంలో పాల్గొనేందుకు ఎలాంటి టిక్కెట్, పాసు అవసరం లేదని, జిల్లా వాసులకు తాను స్వయంగా స్వాగతం పలికి హోమం ప్రాంతాన్ని సందర్శింపజేసేందుకు కృషి చేస్తామన్నా రు. బుధవారం వరకు ఈ యజ్ఞాలు కొనసాగుతాయని తెలిపారు.